ఇందిరమ్మ కాలనీ ఫేజ్ -2లో రేకుల గదులను తొలగిస్తున్న హైడ్రాధికారులు

నిజాంపేటలో హైడ్రా కూల్చివేతలు

- ఇందిరమ్మ కాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్నాయంటూ రేకుల షెడ్డుల తొలగింపు
- బాలాజీహిల్స్‌కాలనీ రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగిన స్థానికులు.. ఉద్రిక్తత

దుండిగల్, మార్చి 4: హైడ్రా మరోసారి చిరు వ్యాపారుల బతుకును ఛిన్నాభిన్నం చేసింది. ఎన్నో ఏండ్ల నుంచి ఉపాధి పొందుతున్న వారి వ్యాపార దుకాణాలను అధికారులు నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేశారు. దీంతో నిజాంపేటలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2 నుంచి బాలాజీహిల్స్‌కాలనీ, కేటీఆర్‌కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఇందిరమ్మ కాలనీవాసులు చిరు వ్యాపారాల కోసం రేకులషెడ్డులను ఏర్పాటుచేసుకున్నారు. వీటి మీదనే వారి బతుకు ఆధారపడి ఉన్నది. ఈ నిర్మాణాలను మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు హైడ్రా అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య వచ్చి జేసీబీలతో కూల్చివేశారు. కొద్దిసేపు కూల్చివేతలను స్థానికులు అడ్డుకోగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సామాన్లు తీసుకుంటామని వేడుకున్నా అధికారులు కనికరించలేదని ఇందిరమ్మ కాలనీవాసులు విలపించారు. వృద్ధులమైన తాము చిన్నపాటి కొట్టును అప్పుచేసి ఏర్పాటు చేసుకున్నామని, ఆ అప్పు తీరక ముందే అధికారులు తమ ఇంటి ముందర షెడ్డును కూల్చివేశారంటూ వృద్ధ దంపతులు విలవిలలాడారు. 70 ఏండ్లు పైబడిన వయసులో తాము ఎలా బతకాలంటూ విలపించారు. మరోవైపు, కూల్చివేతలను నిరసిస్తూ కాలనీవాసులు బాలాజీహిల్స్‌కాలనీ కమాన్ వద్ద రోడ్డుకు అడ్డంగా సామాన్లు వేసి బైఠాయించారు. ప్రభుత్వానికి తమ ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. కనీసం ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే సామాన్లు తీసి బయట పెట్టుకునే వారమని వాపోయారు. తమకు ఇండ్లు ఇచ్చుడేందుకు, కూల్చుడెందుకు? తాము ఇప్పుడు ఎక్కడ తల దాచుకోవాలంటూ పలువురు విలపించారు. దళితులు, గిరిజనులమైన తమపై ప్రతాపం చూస్తున్న అధికారులు మిగతా వారి పట్ల ఎందుకు ఉదాసీనంగా ఉంటున్నారని మండిపడ్డారు.

రియల్టీపై మరో పిడుగు!

మొదటిపేజీ తరువాయి...

మీద కునుకు లేకుండా చేస్తున్నది. అక్రమమో... సక్రమమో.. తర్వాత తేలుస్తాం! ముందైతే 25 శాతం రిబేటుతో ఓపెన్ స్పేస్ చార్జీలు (ఎల్ఆర్ఎస్ ఫీజు) చెల్లించాలంటూ ఆఫర్ ఇచ్చిన ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో మడత పేచీ పెట్టింది. సంబంధిత నీటివనరు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) అనేది రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డుల్లో ఉంటుంది. దీనికి అదనంగా నీటివనరు విస్తీర్ణానికి అనుగుణంగా బఫర్‌జోన్ నిర్ధారించేందుకు మార్గదర్శకాలతో కూడిన ప్రభుత్వ ఉత్తర్వులు అమలులో ఉన్నాయి. ఆ ఉత్తర్వుల ప్రకారం ఎంత పెద్ద చెరువులైనా బఫర్‌జోన్ అనేది గరిష్ఠంగా 30 మీటర్లు (98.42 ఫీట్లు) ఉంటుంది. నదులకైతే పట్టణ ప్రాంతాల్లో గరిష్ఠంగా 50 మీటర్లు (164.04 ఫీట్లు) ఉంది. రెండురోజుల కిందట ప్రభుత్వం జారీచేసిన ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాల్లో కొత్త నిబంధనను తెరపైకి తెచ్చింది. నీటివనరుల చుట్టూ ఏకంగా 200 మీటర్లు (656.16 ఫీట్లు) వరకు ఉన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియను జఠిలంగా మార్చడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

ఆ ప్లాట్లపై అనవసరపు మచ్చ

సాధారణంగా రియల్ రంగంలో లావాదేవీల ప్రక్రియ అతి సున్నితంగా ఉంటుంది. ఒక ప్లాటు వివాదంలో ఉందని నోటి మాటగా ఎవరైనా అన్నా... కొనుగోలు చేసేవారు రిస్క్ ఎందుకని వెనుకడుగు వేస్తారు. ఎవరైనా ముందుకొచ్చినా బహిరంగ మార్కెట్లో ధర కంటే తక్కువకు వస్తుందని చూస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంత పెద్ద చెరువైనా గరిష్ఠంగా బఫర్‌జోన్ 30 మీటర్లు ఉన్నందున దానికి సమీపంలో ఐదారు మీటర్ల వరకు ఉన్న ప్లాట్లకు కాస్త రిస్క్ ఉండే అవకాశముంది. ప్రభుత్వం రెండు రోజుల కిందట ఇచ్చిన ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాల్లో 200 మీటర్లుగా ప్రకటించింది. నిబంధనల కంటే పరిధిని ఏడు రెట్లకు పెంచింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో లేని ప్లాట్లకు వచ్చిన ప్రమాదమేమీ లేదు.. పరిశీలన తర్వాత క్రమబద్ధీకరిస్తాం.. అని అధికారులు సర్దిచెప్పుకోవచ్చు. అసలు ప్రభుత్వం 200 మీటర్ల నిబంధన ఎందుకు పెట్టింది? ఏ ప్రాతిపదికన దీనిని నిర్ధారణకు తీసుకుంది? అనే అనుమానాలు మొదలయ్యాయి. దీంతో నీటివనరుల చుట్టూ పావు కిలోమీటరు వరకు ఉన్న ప్లాట్ల భవితవ్యం గందరగోళంలో పడింది. భవిష్యత్తులో వాటికి ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ రావచ్చు.. కాకపోతే తాత్కాలికంగా ఈ నిబంధన పెట్టడం వల్ల ప్రజల్లో లేని అనుమానాలను కల్పించడంతో పాటు ఆ ప్లాట్లపై పరోక్షంగా ఓ ముద్ర వేసినట్లయిందని ఓ రియల్ వ్యాపారి వాపోయారు. చెరువులు, కుంటల చుట్టూ పావు కిలోమీటరు దూరం వరకు ఉన్న ప్లాట్లను కొనుగోలు చేయాలంటేనే సామాన్యుడు భయపడే పరిస్థితి.

ఎన్‌వోసీకి ఎన్ని తిప్పలో

ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల్లో చెరువులు, కుంటల చుట్టూ 200 మీటర్ల పరిధిలోకి వచ్చే ప్లాట్లన్నింటినీ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల పరిశీలన తర్వాతనే క్రమబద్ధీకరించనున్నట్టు స్పష్టం చేసింది. గతంలోనూ ఇరిగేషన్ శాఖ నుంచి పుట్టగొడుగుల్లా ఎన్‌వోసీలు జారీ అయ్యాయి. వాటి ఆధారంగా నిర్మించుకున్న నివాసాలను హైడ్రా కూల్చివేసిన ఘటనలు కండ్లముందే జరిగాయి. ఎన్‌వోసీలు జారీచేసిన ఇంజినీర్లపైనా చర్యలకు సిఫారసు చేసింది. కత్వా చెరువు పరిధిలోని కూల్చివేతల సమయంలో గతంలో ఎన్‌వోసీలు జారీచేసిన ఇంజినీర్లే తిరిగి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్నాయంటూ మార్కింగ్ చేసిన దృశ్యాలు. 200 మీటర్ల పరిధిలో ఉన్న వారంతా రెండు శాఖల నుంచి ఎన్‌వోసీలు పొందాలని చెప్పడంతో లక్షలాది ప్లాట్ల యజమానులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

మార్కెట్ దెబ్బకి ఎల్ఐసీ విలవిల

భారీగా నష్టపోతున్న స్టాక్ పోర్ట్‌ఫోలియో
ఈ ఏడాది మొదలు రూ.1.5 లక్షల కోట్లు ఆవిరి

ముంబై, మార్చి 4: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)కు స్టాక్ మార్కెట్ నష్టాల సెగ గట్టిగానే తగులుతున్నది. దేశీయ సంస్థాగత మదుపర్లలో అతిపెద్దదైన ఎల్ఐసీకి ఘనమైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోనే ఉన్నది. అయితే 310కిపైగా షేర్లతో కూడిన ఈ పోర్ట్‌ఫోలియో వాల్యూ.. గతకొంత కాలంగా క్షీణిస్తున్న స్టాక్ మార్కెట్లతో భారీగానే ఆవిరైపోతున్నది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా దాదాపు రూ.1.5 లక్షల కోట్లు హరించుకుపోవడం గమనార్హం. గత ఏడాది డిసెంబర్ ఆఖరునాటికి సుమారుగా రూ.14.9 లక్షల కోట్లుగా ఉన్న ఎల్ఐసీ స్టాక్ పోర్ట్‌ఫోలియో విలువ.. గత నెల చివర్లో దాదాపు రూ.13.4 లక్షల కోట్లకు పరిమితమైంది. దీంతో కేవలం జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.1.45 లక్షల కోట్లు పడిపోయినట్టైంది.

ఇదీ సంగతి..

ఇంచుమించుగా ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిన అన్ని కంపెనీల షేర్లు నష్టాలనే పంచుతుండటం ఇప్పుడు ఆందోళన కలిగిస్తున్నది. స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లతోపాటు లార్జ్‌క్యాప్ షేర్లూ నిరాశపరుస్తున్నాయి. ఐటీసీ విషయానికే వస్తే.. ఈ కంపెనీ షేర్లపై ఎల్ఐసీ పెట్టిన పెట్టుబడుల విలువ ఏకంగా రూ.17వేల కోట్లపైనే పడిపోయింది. టీసీఎస్ (4.75 శాతం), ఇన్ఫోసిస్ (10.58 శాతం)ల్లోనూ వాటాలుండగా, రూ.18వేల కోట్లకుపైగా పోయాయి.

ఆర్థిక రంగంలో..

ఎస్బీఐ (9.13 శాతం), ఐసీఐసీఐ బ్యాంక్ (7.14 శాతం), జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (6.10 శాతం)ల్లోనూ ఎల్ఐసీకి పెద్ద ఎత్తునే వాటాలున్నాయి. మార్కెట్ నష్టాలతో రూ.15వేల కోట్లకుపైగా నష్టాలు వచ్చిపడ్డాయి. ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తదితర షేర్లూ.. గడిచిన 2 నెలల్లో రెండంకెల స్థాయి శాతాల్లో నష్టాలు మిగిల్చాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా దాదాపు అన్నింటి వాటాలూ దిగజారాయి. కాగా, ప్రస్తుతం స్టాక్ మార్కెట్లలో నెలకొన్న అస్థిర పరిస్థితులు, అమ్మకాల ఒత్తిళ్లను చూస్తుంటే.. ఎల్ఐసీకి మరిన్ని నష్టాలు తప్పేలా లేవు. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐలు) అదేపనిగా తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటం, చిన్న, మధ్యశ్రేణి షేర్లు బలహీనపడుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.

పాలసీదారుల నమ్మకానికి పరీక్ష

బీమా అంటే ఎల్ఐసీ.. ఎల్ఐసీ అంటే బీమా. భారతీయులకు ఈ సంస్థపై అంతటి ధీమా మరి. ఇక ప్రభుత్వ రంగ సంస్థ కావడం, ఏండ్ల తరబడి సేవలు అందిస్తుండటం, పట్టణాలు-గ్రామాలు అన్న తేడా లేకుండా దేశవ్యాప్తంగా లక్షలాది ఏజెంట్లు, కోట్లాది కస్టమర్లు కలిగి ఉండటం ఎల్ఐసీకి కలిసొచ్చే అంశం. సామాన్యులు ముఖ్యంగా మధ్యతరగతి వర్గాలు తమ కష్టార్జితాన్ని ఎంతో ఇష్టంగా ఎల్ఐసీలో పెట్టి నిశ్చింతగా ఉంటారంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే మోదీ సర్కారు స్టాక్ మార్కెట్లలో ఎల్ఐసీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవడంతో ఇప్పుడు ఈ నమ్మకం అందరిలోనూ సడలుతున్న దుస్థితి. ఇంకా చెప్పాలంటే ఎల్ఐసీ పెట్టుబడి వ్యూహాలు.. పాలసీదారుల రాబడులపైనే అనుమానాల్ని రేకెత్తిస్తున్నాయన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి గట్టిగా వస్తుండటం ఒకింత భయాందోళనల్నే కలిగిస్తున్నాయి.

ఆయా కంపెనీల్లో ఎల్ఐసీ వాటాల విలువ

కంపెనీ	విలువ (రూ.కోట్లలో)
రిలయన్స్ ఇండస్ట్రీస్	1,03,727
ఐటీసీ	75,780
ఇన్ఫోసిస్	67,055
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	62,814
టీసీఎస్	59,857
ఎస్బీఐ	55,597
ఎల్అండ్‌టీ	54,215

- *310కిపైగా కంపెనీల్లో ఎల్ఐసీకి కనీసం 1 శాతాన్ని మించి వాటాలున్నాయి.*
- ***ఈ ఏడాది రూ.1,000 కోట్లకుపైగా నష్టాలను చూపిన షేర్లు కనీసం 35.***
- *టాప్-10 షేర్ల ద్వారా వాటిల్లిన నష్టాల విలువ దాదాపు రూ.70వేల కోట్లు.*
- ***ఎల్ఐసీ షేర్ ధర రూ.733.50 వద్ద ఉన్నది. గత ఏడాది రూ. 1,222 గరిష్ఠ స్థాయిని తాకింది.***
- *గడిచిన కొద్దినెలలుగా క్యాష్ సెగ్మెంట్‌లో ఎఫ్ఐఐలు రూ.3 లక్షల కోట్లకుపైగా విలువైన భారతీయ ఈక్విటీలను అమ్మేశారు.*

బజాజ్ 'ఈ-ఆటో'

న్యూఢిల్లీ, మార్చి 4: ప్రముఖ వాహన సంస్థ బజాజ్ ఆటో..తాజాగా ఎలక్ట్రిక్ ఆటో సెగ్మెంట్‌లోకి అడుగుపెట్టింది. గోగో బ్రాండ్‌తో సరికొత్త ఆటోలను మార్కెట్‌కు పరిచయం చేసింది. సింగిల్ చార్జింగ్‌తో 251 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. రెండు రకాల్లో లభించనున్న ఈ ఆటోల్లో గోగో పీ5009 రకం ధర రూ.3,26,797 గాను, పీ7012 ధర రూ.3,93,004గా నిర్ణయించింది. బ్యాటరీపై సంస్థ ఐదేండ్లపాటు వ్యారంటీ కల్పించింది.

బీఎస్ఎన్ఎల్ హోలీ ఆఫర్

న్యూఢిల్లీ, మార్చి 4: బీఎస్ఎన్ఎల్ హోలీ ధమాకా ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏడాది కాలపరిమితి రీచార్జి ప్లాన్ గడువును మరో నెల రోజులు పొడిగించింది. రూ.2,399తో రీచార్జి చేసుకున్నవారికి మరో 30 రోజుల వ్యాలిడిటిని పొందనున్నారు గతంలో ఈ ప్లాన్ 395 రోజులుగా ఉండగా, ప్రస్తుతం ఇది 425 రోజులకు పెంచింది. ఈ ప్రీపెయిడ్ ప్లాన్‌తో అన్‌లిమిటెడ్ కాలింగ్, రోజుకు 2 జీబీ డాటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లు.

బ్లూస్టార్ 100 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, మార్చి 4: ప్రముఖ ఏసీల తయారీ సంస్థ బ్లూస్టార్ దూకుడు పెంచింది. ఈ వేసవి సీజన్‌లో కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఒకేసారి 150 మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 0.8 టీఆర్ నుంచి 4 టీఆర్ రకాల కూలింగ్ సామర్థ్యాలతో విడుదల చేసిన ఈ ఏసీలు 3-స్టార్, 5-స్టార్ విభాగంలో లభించనున్నాయి. వీటి ప్రారంభ ధర రూ.28,990గా నిర్ణయించినట్లు కంపెనీ ఎండీ త్యాగరాజన్ చెప్పారు. వీటిలో దాదాపు 40 స్మార్ట్ వైఫై ఏసీ మాడళ్లు కూడా ఉన్నాయని, ఈ ఫీచర్‌తో ఉష్ణోగ్రత, ఫ్యాన్ స్పీడ్, కూల్/ఫ్యాన్ మోడ్, 12 గంటలపాటు ప్రతి గంటకు ఒకసారి స్విచ్ ఆన్/ఆఫ్ అయ్యేలా ముందుగా సెట్ చేసుకోవచ్చునని చెప్పారు. నూతన శ్రేణి ఏసీలను రూపొందించడానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఫ్రీడం ఆయిల్ చేతికి శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్!

హైదరాబాద్, మార్చి 4: ఫ్రీడం పేరుతో వంటనూనెలను విక్రయిస్తున్న జెమినీ ఎడబుల్స్ అండ్ ఫాట్స్ ఇండియా..కోయంబత్తూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న శ్రీ అన్నపూర్ణ ఫుడ్స్ సంస్థలో మెజార్టీ వాటాను కొనుగోలు చేసింది. మసాలా, మీల్స్ మిక్స్‌లతోపాటు ఇతర ఉత్పత్తుల సంస్థ శ్రీ అన్నపూర్ణలో 70 శాతం వాటాను కొనుగోలు చేసినట్లు జెమినీ ఎడబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) చంద్ర శేఖర రెడ్డి తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా జీఈఎఫ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక సంస్థను నెలకొల్పింది. జాయింట్ వెంచర్‌లో ఏర్పాటైన ఈ సంస్థతో ఇరు కంపెనీలకు ప్రయోజనం కలగనున్నదన్నారు.

రిలయన్స్‌కు కేజీ దెబ్బ

కేంద్రం నుంచి రూ.24,500 కోట్ల డిమాండ్ నోటీస్

న్యూఢిల్లీ, మార్చి 4: కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో గ్యాస్ ఉత్పత్తికి సంబంధించిన వివాదంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, దాని భాగస్వాములకు కేంద్ర ప్రభుత్వం దాదాపు రూ.24,500 కోట్ల (2.81 బిలియన్ డాలర్లు) డిమాండ్ నోటీసు ఇచ్చింది. కేజీ బేసిన్‌లో రిలయన్స్, బ్రిటీష్ పెట్రోలియం, జపాన్‌కు చెందిన నికో సంస్థలు కలిసి చమురు, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసిందే. అయితే పక్కనే ఉన్న ప్రభుత్వ రంగ చమురు, గ్యాస్ ఉత్పాదక దిగ్గజం ఓఎన్‌జీసీకి చెందిన క్షేత్రాల నుంచి వస్తున్న గ్యాస్‌ను రిలయన్స్, దాని భాగస్వామ్య సంస్థలు వెలికితీసి, అమ్ముకున్నాయన్న వివాదం తలెత్తింది. ఈ క్రమంలోనే 2016లో 1.55 బిలియన్ డాలర్లు చెల్లించాలని కేంద్ర ప్రభుత్వం రిలయన్స్, ఇతర కంపెనీలకు నోటీసులిచ్చింది. దీనిపై అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌కు రిలయన్స్, కంపెనీలు వెళ్లాయి. 2018 జూలైలో రిలయన్స్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో 2023 మేలో ఢిల్లీ హైకోర్టును ప్రభుత్వం ఆశ్రయించగా, సింగిల్ జడ్జి ధర్మాసనం కూడా రిలయన్స్‌కే మద్దతిచ్చింది. అయితే గత నెల ఫిబ్రవరి 14న దీన్ని డివిజన్ బెంచ్ కొట్టేసింది. ప్రభుత్వానికే అనుకూలంగా తీర్పిచ్చింది. దీంతో రూ.24,500 కోట్ల డిమాండ్ నోటీసు కేంద్రం పంపినట్టు స్టాక్ ఎక్స్చేంజీలకు రిలయన్స్ తెలిపింది. దీనిపై సవాల్ చేస్తామని కూడా ప్రకటించింది. మరోవైపు బ్యాటరీ సెల్ ప్లాంట్ ఒప్పందాన్ని మీరినందుకు రిలయన్స్‌పై కేంద్రం రూ.50 కోట్ల జరిమానా వేసింది.

73 వేల దిగువకు సెన్సెక్స్

ముంబై, మార్చి 4: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. టారిఫ్‌ల పెంపు ఆందోళనలు, మరోవైపు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోతుండటం సూచీ 73 వేల దిగువకు పడిపోయింది 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి సూచీ 96.01 పాయింట్లు కోల్పోయి 72,989.93 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 450 పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకున్నది. మరో సూచీ నిఫ్టీ వరుసగా పదోరోజూ నష్టపోయింది. 36.65 పాయింట్లు కోల్పోయి 22,082.65 వద్ద ముగిసింది. ఒక దశలో 22 వేల దిగువకు పడిపోయింది. బ్లూచిప్ సంస్థలు భారీగా నష్టపోవడం వల్లనే సూచీలు ఒత్తిడికి గురయ్యాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

తమకు న్యాయం చేయాలని వరంగల్ జిల్లా నక్కలపల్లి- గుంటూరుపల్లి గ్రామాల మధ్యలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మామునూరు ఎయిర్‌పోర్టు సర్వే అడ్డగింత

- అధికారులను నిలదీసిన రైతులు
- సర్వే నిలిపివేసిన అధికారులు

కరీమాబాద్ (వరంగల్), మార్చి 4 : మామునూరు ఎయిర్‌పోర్టుకు అవసరమైన భూ సర్వే చేసేందుకు మంగళవారం నక్కలపల్లికి వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. రంగశాయిపేట నుంచి తమ గ్రామాలకు రోడ్డు నిర్మాణం చేపట్టిన తర్వాతే సర్వే చేపట్టాలని నక్కలపల్లి, గుంటూరుపల్లి, నల్లకుంట, గాడిపెల్లి రైతులు అధికారులకు సూచించారు. ప్రభుత్వ అనుమతి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణం చేపడతామని అధికారులు చెప్పగా, అనుమతి వచ్చిన తర్వాతే ఇక్కడికి రండి.. అంటూ రైతులు స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి వ్యతిరేకం కాదని, పరిహారం ఎంత ఇస్తారనేది స్పష్టం చేసిన తర్వాతే సర్వే చేపట్టాలని తెలిపారు. దీంతో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఖిలావరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, అధికారులు వెనుదిరిగారు. డీసీపీ రవీందర్‌తో పాటు పరకాల, మామునూరు, నర్సంపేట ఏసీపీలు చేరుకుని రైతులను అడ్డుకున్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి తమ వల్లే అనుమతులు వచ్చాయని సంబురాలు చేసుకున్న అధికార పార్టీ నాయకులపై రైతులు మండిపడ్డారు. ఎకరానికి రూ.3 నుంచి రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

డిమాండ్లు పరిష్కరిస్తేనే సర్వే చేయనిస్తం



సంగెం, మార్చి 4: మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో గుంటూరుపల్లి, గాడిపల్లి, నక్కలపల్లికి చెందిన రైతులం 253 ఎకరాలు కోల్పోతున్నాం. పరిహారం ఇవ్వకుండానే సర్వే చేస్తామంటే ఎట్లా .. గతంలో గ్రామంలోకి వచ్చిన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సత్యశారద డిమాండ్ ప్రకారం పరిహారం ఇస్తామని, గుంటూరుపల్లి నుంచి మామునూరుకు కొత్తరోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రోడ్డులేదని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు మూసేస్తే మూడు కిలోమీటర్లు దూరభారం పెరుగుతుంది. డిమాండ్లు పరిష్కరిస్తేనే భూములు ఇస్తం.

- వీరభద్రారావు, గుంటూరుపల్లి రైతు

ఎకరానికి రూ.5 కోట్లు ఇవ్వాలి

ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికిఎకరానికి రూ.5 కోట్లు ఇవ్వాలి. ప్రస్తుతం ఉన్న వరంగల్-మహబూబాబాద్ రోడ్డు మూస్తే గుంటూరుపల్లి నుంచి మామునూరుకు రోడ్డు వేయాలి. నిర్వాసితులకు విమానాశ్రయంలో ఉద్యోగాలు కల్పించాలి. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తన సామాజిక వర్గానికి చెందిన ఓ నాయకుడి భూములు ఉన్న ప్రాంతం నుంచే పెద్ద రోడ్డు నిర్మాణం చేయాలని చూస్తున్నాడు. మా ఇబ్బందులను మాత్రం పట్టించుకోవడం లేదు. భూములు కోల్పోయిన తర్వాత ఎలా బతకాలి. ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలి.

- వెంకట్రావు, గుంటూరుపల్లి రైతు

బిల్లుల కోసం మళ్లీ రోడ్డెక్కిన మాజీ సర్పంచులు

హైదరాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ): పెండింగ్ బిల్లుల కోసం ఏడాదిగా ఉద్యమిస్తున్న మాజీ సర్పంచులు మంగళవారం మరోసారి నిరసనకు ఉపక్రమించారు. సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ఎదుట పడుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం మహా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా 'ఓ గాంధేయవాది మీనాక్షమ్మా.. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంలో భాగస్వాములైన మా పెండింగ్ బిల్లులు ఇప్పించడమ్మా' అనే ప్లకార్డులు ప్రదర్శించడం గమనార్హం. నిరసన తెలిపిన మాజీ సర్పంచులను పోలీసులు బలవంతంగా తరలించారు. సర్పంచుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగయ్య, ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి, కేశబోయిన మల్లయ్య, మేడబోయిన గణేశ్, నాయకులు పక్కిర బీరప్ప, వినోద్ అంజయ్యగౌడ్, బొట్ల రవీందర్, మన్నె పద్మారెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతను చాటుతున్న తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం నాయకులు

'కళాకారుల హామీలను నిలబెట్టుకోవాలి'

ఖైరతాబాద్, మార్చి 4(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో సమయంలో కళాకారులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ నిరుద్యోగ కళాకారుల సంఘం డిమాండ్ చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనువోజు వెంకన్న మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 1,500మంది కళాకారులను గుర్తించి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఏడాది గడిచినా ఎలాంటి ప్రకటన చేయడం లేదని మండిపడ్డారు. ఆరురోజుల్లో ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రావాలని, లేకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తెలంగాణ కళావేదిక రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నకిరకంటి కిరణ్‌కుమార్, గజవెల్లి ప్రతాప్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉదండాపూర్ రిజర్వాయర్ పనులు అడ్డుకున్న నిర్వాసితులు

జడ్చర్ల, మార్చి 4 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులు తమకు పునరావాసం ప్యాకేజీ ఇవ్వాలంటూ మంగళవారం పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. అనంతరం టెంట్‌లో రిలే దీక్షలో కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు నిర్వాసితులను కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి మాట్లాడించారు. ఉదండాపూర్‌లో ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించిన సర్వే పూర్తి చేయడం జరిగిందని, త్వరలోనే పరిహారం అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కాగా, పునరావాసం ఎప్పుడిస్తారో ఖచ్చితమైన తేదీని ప్రకటించాలని రైతులు ఖరాఖండిగా కలెక్టర్‌కు చెప్పారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని, న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామ, పనులను అడ్డుకోకుండా సాగనివ్వాలని కలెక్టర్ కోరారు. ఇందుకు నిర్వాసితులు గ్రామస్తులతో చర్చించి మా నిర్ణయం చెబుతామని కలెక్టర్, ఆర్డీవోకు స్పష్టం చేశారు.

నిరసన తెలుపుతున్న ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులతో మాట్లాడుతున్న పోలీసులు

బిల్లుల కోసం పాడి రైతుల ఆందోళన

విజయ డెయిరీ ఎదుట నిరసన

బకాయిలు చెల్లించాలని డిమాండ్

యాదగిరిగుట్ట, మార్చి 4 : బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన పాడి రైతులు ఆందోళనకు దిగారు. యాదగిరిగుట్ట విజయ డెయిరీకి చుట్టుపక్కల 35 గ్రామాలకు చెందిన పాడి రైతులు రోజూ 6 వేల లీటర్ల వరకు పాలు పోస్తున్నారు. డెయిరీ నుంచి 15 రోజులకోసారి బిల్లులు చెల్లించాల్సి ఉండగా, రెండున్నర నెలలుగా బిల్లులు రాలేదు. దాదాపు రూ.1.60 కోట్లు రైతులకు రావాల్సి ఉన్నది. దీంతో బాధిత రైతులు మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం డెయిరీ ఇన్‌చార్జి బాలరాజు వినతిపత్రం అందజేశారు.

రేవంత్ సర్కారు హామీలు అమలు చేయాలి

చండూరులో చెప్పులదండ వేసుకుని దివ్యాంగుల నిరసన

చండూరు, మార్చి 4 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నల్లగొండ జిల్లా చండూరులో దివ్యాంగులు మెడలో చెప్పులదండ వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది దివ్యాంగులు అనేక సమస్యలతో అల్లాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కనీసం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ రూ.6వేలు చేస్తామని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మాట ఇచ్చి తప్పినందుకు మెడలో చెప్పుల దండలు వేసుకుని నిరసన తెలుపుతున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia.

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

PUB/0226

ప్రొఫార్మా 10-1
బహిరంగ ప్రకటన

దిగువ సూచించిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్‌పై గల రైల్వే లైన్లు మరియు ఆవరణలను వినియోగించు వారందరికీ ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది:

సెక్షన్: దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్ యొక్క మనోపాడ్ (MOA)- కర్నూల్ సిటీ (KRNT) స్టేషన్ల మధ్య బిజి సింగిల్ లైన్ సెక్షన్‌పై OHE మాస్ట్ లొకేషన్ 235/2A (km/Ch: 235/49.5) నుండి 236/16A (km/Ch: 236/703.30) వరకు అడిషనల్ లూప్‌లైన్స్ (అనగా రోడ్-3: R&D మరియు వర్క్‌షాప్‌లైన్ మరియు రోడ్-4: గూడ్స్ లైన్)పై ఆలంపూర్ రోడ్ (ALPR) వద్ద కొత్తగా ప్రారంభించబడిన OHE విద్యుదీకరణకు సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్యాసింజర్ల ప్రజా రవాణా మరియు ఫ్రైట్ సర్వీస్లు ఆపరేషన్ కొరకు ఆలంపూర్ రోడ్ (ALPR) వద్ద OHE మాస్ట్ లొకేషన్ 235/2A (km/Ch: 235/49.5) నుండి 236/16A (km/Ch: 236/703.30) వరకు 25000 ఓల్ట్, 50Hz, a.c. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో తేది: 04-03-2025న లేదా ఆ తర్వాత విద్యుత్ సరఫరా జరుగును. సదరు తేదీన మరియు సదరు తేది నుండి అన్ని వేళలా ఓవర్‌హెడ్ లైన్‌లో విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లుగా పరిగణించబడును మరియు అనధికృత వ్యక్తి ఎవరూ ALPR యార్డ్ నుండి అడిషనల్ లూప్‌లైన్స్ మరియు కోచ్ రిహబిలిటేషన్ వర్క్ షాప్ లైన్‌పై సదరు ఓవర్ హెడ్ లైన్ సమీపంలో పని చేయరాదు లేదా సమీపించరాదు.

ప్రొఫార్మా 10-2
(ACTM Para 21020, Vol II, Part I : Correction Slip No. 32, Dated 09-10-2020)
ac 25kV ట్రాక్షన్ ప్రారంభం
"రహదారి వినియోగదారులకు హెచ్చరిక"

దిగువ సూచించిన సెక్షన్‌లో 25KV AC ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ప్రారంభానికి సంబంధించి ప్రజలకు సమాచారమిచ్చు నిమిత్తం ఈ విధంగా ప్రకటించడమైనది:

సెక్షన్: దక్షిణ మధ్య రైల్వేలోని హైదరాబాద్ డివిజన్ యొక్క మనోపాడ్ (MOA)- కర్నూల్ సిటీ (KRNT) స్టేషన్ల మధ్య బిజి సింగిల్ లైన్ సెక్షన్‌పై OHE మాస్ట్ లొకేషన్ 235/2A (km/Ch: 235/49.5) నుండి 236/16A (km/Ch: 236/703.30) వరకు అడిషనల్ లూప్‌లైన్స్ (అనగా రోడ్-3: R&D మరియు వర్క్‌షాప్‌లైన్ మరియు రోడ్-4: గూడ్స్ లైన్)పై ఆలంపూర్ రోడ్ (ALPR) వద్ద కొత్తగా ప్రారంభించబడిన OHE విద్యుదీకరణకు సంబంధించి.

దక్షిణ మధ్య రైల్వేలో ప్యాసింజర్ల ప్రజా రవాణా మరియు ఫ్రైట్ సర్వీస్లు ఆపరేషన్ కొరకు ఆలంపూర్ రోడ్ (ALPR) వద్ద OHE మాస్ట్ లొకేషన్ 235/2A (km/Ch: 235/49.5) నుండి 236/16A (km/Ch: 236/703.30) వరకు, ALPR యార్డ్ మరియు కొత్తగా ప్రతిపాదించిన లైన్ పరిధిలో ఎల్‌సి గేట్స్ లేనందున హైట్ గేజ్‌లు ఉన్నాయని పబ్లిక్ నోటీస్ వర్తించదు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TR / హైదరాబాద్

A0291